మిర్యాలగూడలో కార్డన్ సెర్చ్

- సరైన పత్రాలు లేని 60 వాహనాలు స్వాధీనం

పోలీసులు పట్టుకున్న వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

మిర్యాలగూడ, ఏప్రిల్ 10: మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో గురువారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 60 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో కొంతమంది అనుమానిత వ్యక్తులను గుర్తించినట్లు చెప్పారు. 57 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలకు పత్రాలు లేక పోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటిలో కొన్ని వాహనాలకు నంబర్లు ట్యాంపరింగ్ చేసినట్లు గుర్తించామన్నారు. ఈ వాహనాల ద్వారా ఎక్కడైనా నేరాలకు పాల్పడ్డారా అనే విషయమై దర్యాప్తు చేయాల్సి ఉందని తెలిపారు. ఎవరైన అనుమానిత వ్యక్తులు సంచరించినా, అతివేగంగా వాహనాలు నడిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వారి వివరాలు పోలీసులకు తెలపాలని సూచించారు. కార్డన్‌సెర్చ్‌లో సీఐలు పీఎన్‌డీ.ప్రసాద్, మోతీరాం, సోమనర్సయ్య, 12 మంది ఎస్ఐలు, 80 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర ఇప్పించడంలో ప్రభుత్వాలు విఫలం

- మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 10: రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇప్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు కనీసం మద్దతు ధర కూడా ఇప్పించలేకపోతున్నారని, దాంతో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మిల్లుల వద్ద ధాన్యాన్ని అమ్ముకునేందుకు వెళ్లిన రైతులను మిల్లర్లు మోసం చేస్తున్నారని, అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరంన్నర కావస్తున్నా, రెండు సీజన్లు దాటిపోయినా కనీసం రైతుభరోసా ఇవ్వలేదన్నారు. రుణమాఫీ ఇంకా రూ.10 వేల కోట్ల పెండింగ్ ఉందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జగదీశ్చంద్ర, రవినాయక్, బావండ్ల పాండు, తిరుపతి రామ్మూర్తి, ఎండీ.అంజద్ పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. తల పగులగొట్టారు

- పోలీసులు కొట్టారని అన్నదమ్ముల ఆవేదన
- నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అన్నదమ్ములు

నకిరేకల్, శాలిగౌరారం, ఏప్రిల్ 10 : ఇండ్ల ప్లాట్ల విషయంలో తమకు న్యాయం చేయాలని శాలిగౌరారం పోలీస్ స్టేషన్‌కు వెళ్తే ఎస్ఐ, కానిస్టేబుళ్లు తమను విచక్షణా రహితంగా కొట్టారని శాలిగౌరారం మండలం ఎన్జీ కొత్తపల్లికి చెందిన రాపోలు అంజి, రాపోలు పరుశురాములు వాపోయారు. గురువారం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు మీడియాకు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఎన్జీ కొత్తపల్లిలో ఉన్న తమ ఇండ్ల ప్లాట్లను తమ బాబాయి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడని, తమకు న్యాయం చేయాలని కోరుతూ తాము బుధవారం శాలిగౌరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఎస్ఐ తమ ఫిర్యాదును పట్టించుకోకుండా, తమకు న్యాయం చేయకుండా తమ బాబాయి తరపు పెద్దమనిషి చెప్పింది విని తమనే కొట్టారని ఆరోపించారు. ఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్లు కలిసి తమపై విచక్షణా రహితంగా కొట్టారని వారి దెబ్బలకు తల పగిలిందని, కాళ్లు విరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి 8 గంటలకు ఎస్ఐ వచ్చి ''సారీ మిస్టేక్ అయ్యింది, తమకు సరైన సమాచారం రాలేదు. ఇప్పుడు పూర్తిగా తెలిసింది. నీకు న్యాయం చేస్తా.. ఎవరికీ చెప్పొద్దు అంటూ తమను బతిమిలాడారని రాపోలు అంజి వాపోయాడు. రాత్రి 9 గంటలకు పోలీసులు తమను ఇంటికి పంపించడంతో బంధువుల సాయంతో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకున్నట్లు తెలిపాడు. ఈ విషయమై శాలిగౌరారం ఎస్ఐ సైదులును వివరణ కోరగా.. తాను ఎవరినీ కొట్టలేదని, వారికి వారే కొట్టుకుని స్టేషన్‌కు వచ్చారని తెలిపారు. కాకపోతే స్టేషన్‌లో కూర్చోబెట్టి వివరాలు అడిగి తెలుసుకున్నామని.. ఇరువురిపై కేసు నమోదు చేశామని చెప్పారు. అయితే ఈ విషయం మీడియాకు చెబితే మళ్లీ కొడతామని ఆస్పత్రికి వచ్చిన తరువాత కూడా పోలీసులు అంజి, పరుశురాములను బెదిరించడం గమనార్హం.

పిడుగు పాటుకు గొర్రెల కాపరి మృతి

గుర్రంపోడ్, ఏప్రిల్ 10: మండలంలోని ఆమలూరు గ్రామంలో గురువారం సాయంత్రం పిడుగు పాటుకు గొర్రెల కాపరి మృతి చెందాడు. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేకల చిన్న రాములు(65) గొర్రెలను మేపడానికి చేపూర్ గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లాడు. సాయంత్రం సమయంలో ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో పాటు అతడికి సమీపంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా యొక్క క్లయింట్ శ్రీ యం.వేణుమాదవ్, తండ్రి:బాబురావ్, R/o. ఉప్పల్, మేడ్‌చెల్ మల్‌కాజ్‌గిరి జిల్లా వాస్తవ్యులు శ్రీ గూడూరు జయపాల్‌రెడ్డి తండ్రి మంగారెడ్డి, గ్రామము: గూడూరు, బీబీనగర్ మం॥, యాదాద్రి భువనగిరి జిల్లా గారి వద్ద నుండి వీరు లే అవుట్ చేసిన వెంచర్ యందు సర్వే నెం.96/అ/2 నందు ప్లాటు నెం.134, 135, 136, 137, 138, 139, 140, 141, 142 రామాజీపేట గ్రామము నందు గల ప్లాట్లను నా యొక్క క్లయింట్ ఖరీదు చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు సన్నిద్ధమైయున్నాడు కావున ఇట్టి ప్లాట్లపై ఎవ్వరికైన ఎలాంటి అభ్యంతరములు యున్నచో ఈ ప్రకటన వెలువడిన రోజు నుండి 5 రోజులలోపు వీరి యొక్క అభ్యంతరములు ఈ క్రింద ఇవ్వబడిన న్యాయవాది కార్యాలయములో అందజేయగలరు ఎలాంటి అభ్యంతరములు రాని ఎడల తర్వాత అభ్యంతరాలు తెలియజేసినచో పరిగణలోకి తీసుకొనబడదు. అని ఈ ప్రకటన ద్వారా తెలియజేయనైనది. నా యొక్క క్లయింట్ అనుమతితో ఇట్టి ప్రకటన ప్రచురించబడినది.

గొట్టిపాముల బాబురావ్
గొట్టిపాముల శరణ్య
న్యాయవాదులు
ఇంటి నం.3-1-118/3, సంతోష్‌నగర్,
సెల్:9553085487, 9848154655

ప్రకటన

నా క్లయింట్ తసనీమ సుల్తానా భర్త సయ్యద్ నజీరఉల్లా, వయసు 49 సం. వృత్తి గృహిణి, నివాసం ఇంటి నం. 4-3-80, ఇస్లామపురా, నల్లగొండ పట్టణం & జిల్లా గారు ఇచ్చు ప్రకటన ఏమనగా! నా ఇంటి ప్లాట్ యొక్క విక్రయ దస్తావేజు నెం.14271/2022, Dated: 29-08-2022, SRO- Nalgonda ద్వారా కొనుగోలు చేసినాను. దాని యొక్క ఒరిజినల్ లింక్ విక్రయ దస్తావేజు నెం.6973/1999, తేది:25-07-1999& 9428/2014 తేది: 27-10-2014 SRO- Nalgonda ఇల్లు మారుస్తుండగా మార్గమధ్యలో పోయినవి. కావున ఇట్టి విషయము 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు ఇచ్చినాను. సదరు ఆస్తి యొక్క వివరములు ఇంటి నెం.4-3-100 (4-3-76), విస్తీర్ణం 235.32 చదరపు గజాలు 196.72 చదరపు మీటర్లు, అక్కడవలమ, నల్లగొండ పట్టణం & జిల్లా సదరు ఆస్తి యొక్క హద్దులు ఉత్తరం: శరీఫుద్దీన్ గారి ఇల్లు, దక్షిణం: 5.00 దారి, తూర్పు:5.00 దారి, పడమర:5.00 దారి ఎవ్వరికైనను పై దస్తావేజు దొరికినచో నా క్లైంటుకు తిరిగి ఇవ్వగలరు. ఇట్టి విషయంపై ఎవ్వరికైనను ఎటువంటి అభ్యంతరమునచో తగిన ఆదారములతో (7) వారం రోజులలో ఈ క్రింది తెలిపిన అడ్రస్‌లో సంప్రదించగలరు.

సం/- నాంపల్లి చంద్రశేఖర్
న్యాయవాది & నోటరీ
ఇంటి నం.6-2-439/1, శ్రీనగర్ కాలనీ,
నల్లగొండ-508001, తెలంగాణ,
నల్లగొండ సెల్: 9440422393
తేది:10-04-2025

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

వాల్‌రైటింగ్స్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 10 : వరంగల్ జిల్లాలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు నియోజక వర్గం నుంచి కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలి రావాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. గురువారం నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలో గోడలపై వాల్‌రైటింగ్స్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం గత పదేండ్లు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి కుంటుపడిందని, ఆ పార్టీ నాయకులు వనరులను దోచుకుంటూ తెలంగాణ ఇమేజ్‌ని దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని దివాలా తీయించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో విరక్తి కలిగిందని, వారంతా మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. వరంగల్ సభకు నకిరేకల్ నియోజకవర్గం నుంచి 10 వేల మందికి పైగా తరలి వెళ్లనున్నట్లు చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు యానాల అశోక్ రెడ్డి, బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, చింత ప్రమీళ, దుబ్బాక శ్రీధర్, చిరుమర్తి యాదయ్య, దోసపాటి విష్ణు మూర్తి, నర్సింహ, రవి ఉన్నారు.

పీఏపల్లి : మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వల్లపురెడ్డి

సభను విజయవంతం చేయాలి

పెద్దఅడిశర్లపల్లి : ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు వల్లపురెడ్డి పిలుపునిచ్చారు. గురువారం అంగడిపేట స్టేజీవద్ద గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలిచ్చి నేటికీ అమలు చేయలేదన్నారు. వాటిని అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందన్నారున. కార్యక్రమంలో నాయకులు మునగాల అంజిరెడ్డి, అర్వపల్లి నర్సింహ, ఎర్ర యాదగిరి, రాయినబోయిన శ్రీను, గోలిగిరి, మహేందర్, వెంకన్న, హనుమా పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

మునుగోడు, ఏప్రిల్ 10 : మండల కేంద్రంలోని సత్యం ఫంక్షన్‌హాల్లో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మండల మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యకార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

12న చండూరులో..

చండూరు, ఏప్రిల్ 10: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ విజయవంతం కోసం ఈ నెల 12న పార్టీ చండూరు మండల ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న, కొత్తపాటి సతీశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని కస్తాల రోడ్డులో గల భారతి చంద్ర గార్డెన్స్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు జరిగే సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దామరచర్ల, ఏప్రిల్ 10: దామరచర్ల సబ్‌స్టేషన్ మెయింటేనెన్స్ పనులు చేపట్టడం, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను బిగిస్తున్నందున శుక్రవారం పలుఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎండీ అబ్దుల్లా హబీబ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దామరచర్ల టౌన్ ఫీడర్‌తో పాటు ఏజీఎల్, లిఫ్ట్, టీవీగూడెం ఏజీఎల్, నర్సాపురం, బొత్తలపాలెం, వాచ్యాతండా, వాడపల్లి ఫీడర్ల కింద ఉన్న అన్ని గ్రామాలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

గుంటిపల్లిలో చలివేంద్రం

నిడమనూరు, ఏప్రిల్ 10 : మండలంలోని గుంటిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బోనగిరి రమేశ్, మాజీ సర్పంచ్ నర్సింగ్ విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి అశోక్, నాయకులు రూపని కృష్ణయ్య, సిరిషాల యాదగిరి, మహ్మద్ జాని పాషా పాల్గొన్నారు.

ఎంజీయూ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని వినతి

రామగిరి, ఏప్రిల్ 10: మహాత్మా గాంధీ యూనివర్సిటీలోని హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం విద్యార్థులు హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ దోమల రమేశ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ హాస్టల్స్‌లో తాగునీరు సక్రమంగా లేదని, క్లీనింగ్, నూతన మెస్ బిల్డింగ్‌తోపాటు పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో ఏబీవీపీ వర్సిటీ అధ్యక్షుడు హనుమాన్, విద్యార్థులు ఉన్నారు.

నిరుపేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

మిర్యాలగూడ, ఏప్రిల్ 10: నిరుపేదల కడుపు నింపేందుకే ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నదని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సన్న బియ్యం లబ్ధిదారుల ఇండ్లల్లో వారు సహపంక్తి భోజనం చేశారు. సన్నబియ్యం పంపిణీతో బియ్యం దందా బంద్ అవుతుందన్నారు. పేదలు సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హాలియా, ఏప్రిల్ 10 : పేద ప్రజల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. గురువారం అనుముల మండలం కొరివేనుగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. అనుముల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ సుజాత, పంచాయతీకార్యదర్శి వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు : ఆర్డీఓ శ్రీదేవి

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ

చండూరు, ఏప్రిల్ 10: రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని చండూరు ఆర్డీఓ శ్రీదేవి సూచించారు. రైతుసేవా సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అంగడిపేట, కొండాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె డీసీసీబీ డైరెక్టర్ కోడి సుష్మావెంకన్నతో కలిసి ప్రారంభించారు. కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ దశరథ, ఏఓ చంద్రిక, ఏఈఓలు శోభ, రాకేశ్, సంఘం కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సోమన్నకు పలువురి నివాళి

సోమన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కట్టంగూర్, ఏప్రిల్ 10 : కట్టంగూర్ మాజీ సర్పంచ్ దివంగత కాపుగంటి సోమన్న వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ అవరణలో ఉన్న ఆయన విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీలు మాదయాదగిరి, సుంకరబోయిన నర్సింహ మాట్లాడుతూ కాపుగంటి సోమన్న గ్రామానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డిపల్లి సాగర్, చెరుకు యాదగిరి, గట్టిగొర్ల సత్తయ్య, కాపుగంటి శ్రీను, మిట్టపల్లి శివ, అంజన్‌కుమార్, పరమేశ్ పాల్గొన్నారు.

నిలిపి ఉంచిన ట్రాక్టర్ ట్రాలీని ఢీకొని ఇద్దరు మృతి

నల్లగొండ సిటీ, ఏప్రిల్ 10 : రోడ్డుపై నిర్లక్ష్యంగా నిలిపి ఉంచిన ట్రాక్టర్ ట్రాలీని ఢీకొని బైకుపై వేర్వేరుగా వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ సంఘటన కనగల్ మండలం బాబాసాయిగూడెం స్టేజీ సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. కనగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిడమనూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సింగం కొండల్ ట్రాక్టర్‌లో వరి ధాన్యం తీసుకుపోతుండగా బాబాసాయిగూడెం స్టేజీ సమీపంలో పంచర్ కావడంతో రోడ్డుపైనే ట్రాలీని వదిలి వెళ్లారు. గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామానికి చెందిన బలుగూరి శేఖర్(43), మిర్యాలగూడ నుంచి బైక్‌పై వస్తుండగా ట్రాలీని ఢీకొని మృతిచెందాడు. ఆ తర్వాత కొద్ది సేపటికి అదే ట్రాలీని బైకుపై వస్తున్న అనుముల మండలం బంటువారిగూడేనికి చెందిన చింతకాయల కిరణ్ (32) ఢీకొని చనిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాలి

- సీపీఎం నాయకుల నిరసన

నల్లగొండలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రామగిరి, ఏప్రిల్ 10: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం నల్లగొండలోని సుభాశ్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నల్లజెండాలు చేతపట్టి ఆందోళన చేశారు. రోడ్డుపై గ్యాస్ సిలిండర్ ఉంచి కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెండచడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సయ్యద్ హాషం, పుచ్చలకాల నర్సిరెడ్డి, కోట్ల అశోక్ రెడ్డి, సైదులు, దండెంపల్లి సత్తయ్య, ఎండీ సలీం, పద్మ, మహిళాలు పాల్గొన్నారు.

చండూరు : సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయ, నాయకులు వెంకటేశం, చిట్టిమల్ల లింగయ్య, నరసింహ, గౌసియాబేగం పాల్గొన్నారు.

మిర్యాలగూడటౌన్ : భాగ్యనగర్‌కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో గ్యాస్‌సిలిండర్లతో నిరసన తెలిపారు. పార్టీ నాయకులు వీరేవెల్లి వెంకటేశ్వర్లు, పాదూరి శశిధర్‌రెడ్డి, మూడావత్ రవినాయక్, పాదూరి గోవర్ధని, కోడు కృష్ణయ్య, రామ్మూర్తి, రవి, జానకి, సంధ్య, సుగుణమ్మ, సతీశ్, వెంకటయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో కాంటాలను ముమ్మరం చేయాలి

- రైతుసంఘం నాయకులు

వేములపల్లి, ఏప్రిల్ 10: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటా వేసి కొనుగోలు చేయాలని రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని సల్కునూరు, బొమ్మకల్ గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందే గానీ కొనుగోళ్లు చేపట్టడం లేదన్నారు. దాంతో వాతావరణంలో మార్పుల వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. వారి వెంట నాయకులు జిల్లా యాదగిరి, మద్దిరాల రంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, రోశయ్య, సత్యం, సైదులు ఉన్నారు.

బాగా చదవాలి.. ఉన్నతంగా ఎదుగాలి

- గిరిజన గురుకుల విద్యార్థినులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి మాటా మంతి
- ప్రశ్నలడిగి.. చాక్లెట్స్ ఇచ్చి ప్రోత్సహించిన కలెక్టర్

విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దవూర, ఏప్రిల్ 10: విద్యార్థినులు బాగా చదివి.. ఉన్నత లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల సంక్షేమ వసతిగృహాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో మాట్లాడారు. భోజనం ఎలా ఉంది, ఎలా చదువుకుంటున్నారని ప్రశ్నించారు. ఐఐటీ అంటే తెలుసా అంటూ ప్రశ్నించారు. ఐఐటీ సాధించాలంటే లెక్కల్లో పర్‌ఫెక్ట్‌గా ఉండాలని, ఐఐటీపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు నల్లగొండలో ఉచితంగా కోచింగ్ ఇప్పిస్తానని, ఎంతమందికి కోచింగ్ కావాలో పేర్లు ఇవ్వాలని అన్నారు. డాక్టర్ కావాలంటే ఏం చదవాలని అడిగారు. నల్లగొండలో నీట్‌కు కోచింగ్ ఇచ్చేందుకు ఐదు సంస్థలు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. పలు సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానం రాబట్టారు. బాగా ఆన్సర్ చెప్పిన వారికి చాక్లెట్స్ అందించారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి రాజ్‌కుమార్, తాసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఉన్నారు.

తండాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు : కలెక్టర్

నందికొండ, ఏప్రిల్ 10 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ధర్తీ ఆబా జన్‌జాతీయ యోజన ద్వారా గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నందికొండ మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి రాజ్‌కుమార్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, డీపీఓ వెంకయ్య, మత్యశాఖ ఏడీ చరితతో కలసి సంబంధిత అధికారులతో ధర్తీ ఆబా జన్‌జాతీయ యోజన కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం కింద రూ.95 కోట్లతో జిల్లాలోని గిరిజన గ్రామాలలో వసతుల కల్పనకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, పెద్దవూర తా